ఫెన్సింగ్ వేయరు..
సర్కారు స్థలం కాపాడరు!

అధికారులకు ఆలోచనే లేదు!

చింతల్: ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు అండదండలు అందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని సర్వేనం.155లో 2007లో కొలతలతో కూడిన 3500 గజాల స్థలానికి (29 గుంటలు) 90 శాతం మేర ఫెన్సింగ్ పనులు పూర్తి చేశారు. మిగతా పది శాతం మేర ఈ ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్ వేయడానికి వచ్చిన అధికారులను పక్కనే ఉన్న ధోబీఘాట్ వాసులు అడ్డుకోవడంతో ఈ ఫెన్సింగ్ పనులు నిలిచిపోయాయి. కాగా ఇటీవల ఈ ప్రభుత్వ స్థలంపై కొంతమంది అక్రమార్కుల కన్నుపడటంతో ఏడు ప్లాట్లుగా విభజించి అమ్మేందుకు ధోబీఘాట్ వాసులు మరికొంత మంది అక్రమార్కులు ప్రయత్నించినట్లు భగత్‌సింగ్‌నగర్‌లో గుసగుసలు వినిపించాయి. దీంతో ఈ స్థలానికి మిగిలిపోయిన ఫెన్సింగ్ పనులు పూర్తి చేయాలంటూ భగత్ సింగ్‌నగర్ వాసులు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు.

సర్వే రిపోర్టు బయటకు రానివ్వని వైనం..

ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న డిప్యూటీ కమిషనర్ మిగిలిపోయిన పనికి అసంబద్ధంగా జిల్లా సర్వే అధికారులకు సర్వే చేయాలంటూ రిపోర్టు పంపారు. ఈ సర్వే రిపోర్ట్ ఇప్పటివరకు బయటకు రానీయకుండా టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు దాచిపెడుతూ కాలయాపన చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మిగిలిపోయిన పనులు పూర్తి చేయాలంటూ జోనల్ కార్యాలయం నుంచి జోనల్‌కమిషనర్, టౌన్‌ప్లానింగ్ ఇంజినీరింగ్ అధికారులు ఆదేశించిన ఇక్కడ ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇంజినీరింగ్ అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఒక అధికారికి మరో విభాగం అధికారికి మధ్య సమన్వయ నెట్టి వేసుకుంటూ కాలయాపన చేస్తున్నారు.

◆ సర్వే రిపోర్ట్ ఇచ్చి హద్దులు చూపిస్తే ఫినిషింగ్ వేస్తామంటూ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటూ ఉండగా... టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఉన్న అధికారులు అక్రమార్కులకు అండగా ఉంటూ సర్వే రిపోర్ట్ ఇంకా తమ వద్దకు రాలేదని కొంతకాలం కాలయాపన చేయడం.. అదేవిధంగా మీకు సర్వే రిపోర్ట్ కావాలంటే జిల్లా సర్వే అధికారులను తోటి సంప్రదింపులు జరుపుకోవాలని చేస్తున్నట్లు తెలుస్తోంది.

◆ ఇక్కడ ఫెన్సింగ్ వేయడం ఆలస్యం చేస్తే ప్రస్తుతం మిగిలి ఉన్న ఫెన్సింగ్‌కు నిధుల గడువు ముగిసిపోవడంతో అక్రమార్కులకు వరంగల్ మారే సూచనలు ఉండటంతో టౌన్ ప్లానింగ్ అధికారులు కాలయాపన చేస్తున్నట్లు భగత్‌సింగ్‌నగర్ వాసులు ఆరోపిస్తున్నారు.

◆ అసలు కొలతలతో కూడిన లేఔట్ ఇచ్చిన తర్వాత మరల సర్వే ఎందుకు అనేది సర్వత్రా తలెత్తుతున్న విషయం. అప్పుడు చేపట్టిన సర్వే కాదా.. చేసిన వారు అధికారులు కాదా.. నిధులు మంజూరైన పనికి సర్వే ఎందుకు అనేది ఇక్కడ ఉన్న డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులకే తెలియాలి.



ఫెన్సింగ్ వేయాల్సిన ప్రాంతం ఇదే..

నేను ఎవరి మాట వినను..
టౌన్‌ప్లానింగ్‌లో ఓ అధికారి..


◆ భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలానికి 10 శాతం మిగిలి ఉన్న ఫెన్సింగ్ పూర్తి చేయాలంటూ జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్, జోనల్ టౌన్ ప్లానింగ్ విభాగం, ఇంజినీరింగ్ అధికారులు ఆదేశించినా స్థానిక టౌన్‌ప్లానింగ్ అధికారి వారి ఆదేశాలను ధిక్కరిస్తున్నట్లు తేటతెల్లమవుతుందని భగత్‌సింగ్‌నగర్ వాసులు ఆరోపిస్తున్నారు.

◆ ప్రస్తుతం సర్వే రిపోర్టు వచ్చి చాలా రోజులైనా సదరు టౌన్‌ప్లానింగ్ అధికారి ఇంజినీరింగ్ అధికారులకు లేఅవుట్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని ఇంజినీరింగ్ అధికారి పేర్కొంటున్నారు.

◆ వారు సర్వే రిపోర్ట్ ప్రకారం మాకు హద్దులు చూపిస్తే మేము ఫెన్సింగ్ వేయడానికి సిద్ధంగా ఉన్నామంటూ పేర్కొంటున్న సదరు టౌన్ ప్లానింగ్ అధికారి డిప్యూటీ కమిషనర్ అండదండలతో కాలయాపన చేసి ఈ స్థలంలో ఏడు ప్లాట్లుగా విభజించి అమ్మేందుకు ప్రయత్నిస్తున్న కబ్జాదారులకు అనుకూలంగా మారినట్లు సదరు టౌన్ ప్లానింగ్ అధికారులు అధికారిపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. జోనల్ కమిషనర్ నుంచి వారి ఆదేశాలను సైతం ధిక్కరించడం చదరధికారికే చెల్లింది.

ముడుపులు అందినట్లు గుసగుసలు...

◆ ఈ ప్రభుత్వ స్థలంపై కన్నేసిన కబ్జాదారులు ఇప్పటికే మనకు అనుకూలంగానే సర్వే రిపోర్ట్ వచ్చిందని దీనికోసం అందరూ సమానంగా ఉండి ఏడు ప్లాట్లను అమ్మి సొమ్ము చేసుకోవాలనుకున్నట్లు వ్యూహ రచన చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగా భగత్ సింగ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తితో పాటు.. ఓ రాజకీయ నేత దిక్సూచిగా మారి అధికారులు ఇక్కడ పనులు చేయకుండా వారిని ఆదేశించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అసలు పది శాతం ఫెన్సింగ్ వేయడానికి ఇంకా ఎన్ని సంవత్సరాలు ఎదురు చూడాలో అధికారుల పనితీరుకు నిదర్శనంగా మారింది.



భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలానికి సంబంధించిన లేఅవుట్

నత్తనడకన డీసిల్టింగ్ పనులు

జగద్గిరిగుట్ట: కోట్ల రూపాయలు వెచ్చించి ప్రారంభించిన డీసిల్టింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జంట సర్కిళ్లు గాజులరామారం, కుత్బుల్లాపూర్‌లలో ఈ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటికీ 25 శాతం వరకు పనులు పూర్తి చేశారు. వచ్చే 2నెలల కాలంలో ఈ పనులను మొత్తం పూర్తి చేయాలి. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో నాలాలకు ఆనుకొని ఉన్న కాలనీలను ముంచెత్తడం మామూలైంది. కాగా ఈ సంవత్సరమైనా పనులు అనుకున్న సమయానికి పూర్తి చేసి ఎటువంటి సమస్య రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పలు కాలనీల ప్రజలు కోరుతున్నారు. పాపయ్యయాదవ్ నగర్ నాలా వద్ద మూడు రోజులుగా వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోతే ప్రజలు రోగాల బారిన పడతారని పేర్కొన్నారు. వ్యర్థాలను తొలగించే ప్రక్రియ వేగవంతం చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



పాపయ్యయాదవ్ నగర్ నాలా వద్ద..

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతు పనుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని భౌరంపేట్ సబ్‌స్టేషన్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30గంటల నుంచి 8.30గంటల వరకు సింహపురి కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, డాలర్ డ్రీమ్ విల్లాస్, కోకకోలా గోదాము, గోకుల్ బృందావన్, గోకుల్ నందన్, నెస్ట్ విల్లాస్, బావర్చీ హోటల్, డీఆర్‌కే కళాశాల, కేఎల్‌హెచ్ యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అపర్ణ ఫీడర్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ అపర్ణ ఫీడర్ పరిధిలోని అపర్ణ పామ్‌గ్రోవ్, వెంకటేశ్వరకాలనీ, దేవేందర్‌కాలనీ, మికాసా స్టెర్లింగ్, అమర్ రోడ్డు, సెంట్రల్ పార్క్ తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి 8గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

బస్తీ రోడ్డుపైకి శ్లాబ్‌ల నిర్మాణం

అంబులెన్స్, ఫైర్‌ఇంజిన్ వాహనాలు ఎలా వస్తాయని ప్రశ్నిస్తున్న స్థానికులు



దేవేందర్‌నగర్ పోచమ్మబస్తీలో..



పోచమ్మ బస్తీలో రోడ్డుకు ఇరువైపులా జరిగి నిర్మాణం

సుభాష్‌నగర్: అసలే ఇరుకైన రోడ్లతో ఇబ్బందులుంటే కొందరు స్వార్థంతో నిబంధనలు బేఖాతరు చేస్తూ.. శ్లాబ్ రోడ్డుపైకి వచ్చేలా నిర్మాణాలు చేపడుతున్నారని దేవేందర్‌నగర్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అఫ్జల్‌షేక్ అన్నారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని పోచమ్మ బస్తీలో కొంతమంది రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు ఫిబ్రవరిలో మూడుసార్లు సంబంధిత అధికారులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. అయినప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ విధంగానే రోడ్డుపై నిర్మాణాలు చేపడితే భవిష్యత్‌లో బస్తీలోకి భారీ వాహనాలు, అంబులెన్స్, ఫైర్ ఇంజిన్ లాంటి వాహనాలు రావాలంటే ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని కోరారు.

సిబ్బంది కొరతతో సర్టిఫికెట్ల జారీలో జాప్యం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో సిబ్బంది కొరతతో వివిధ సర్టి ఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల వివిధ ఉద్యోగాల భర్తీకి ప్రభు త్వం చర్యలు చేపట్టడంతో కోర్సులు పూర్తి చేసిన వందలాది మంది పూర్వ విద్యార్థులు డిగ్రీ పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎక్కువ ఫీజు చెల్లించి స్పీడ్ మోడల్‌లో దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్లు సకాలంలో అందడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో పూర్తిగా కాంట్రాక్టు ఉద్యోగులతో కొ నసాగుతుంది. వారి సంఖ్య చాలా తక్కువగా ఉండటంతో సర్టిఫికెట్ల జారీ, ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనలో జాప్యం జరుగుతుందని వీసీ ప్రొ.రవీందర్ స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించాలన్నారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశాల ప్రకటన విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఓయూతో పాటు రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్–2024 (సీపీజీఈటీ) నోటిఫికేషన్ విడుదల ప్రతి ఏటా జాప్యంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. లా సెట్, ఐసెట్, ఇంజినీరింగ్ పీజీ సెట్, ఎడ్‌సెట్ తదితర సెట్ల నోటిఫికేషన్లు విడుదలైన పీజీ కోర్సుల ప్రకటనపై నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పీజీ ప్రవేశాల ప్రకటన జాప్యంతో ఓయూతో పాటు జేఎన్‌టీయూ, కాకతీయ, శాతావాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, తెలంగాణ ప్రభుత్వ మహిళ వర్సిటీలలో ఎంట్రెన్స్ టెస్టు మొదలుకొని ప్రవేశాల ప్రక్రియ, తరగతులు, సెమిస్టర్ పరీక్షలు, ఫలితాల విడుదలలో ఆలస్యమవుతుందన్నారు. సకాలంలో పీజీ కోర్సుల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మర్యాదపూర్వక కలయిక

కుత్బుల్లాపూర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం బీసీ ఐక్యవేదిక తెలంగాణ అధ్యక్షుడు మహేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీలో బీసీ కుల గణనపై తీర్మానం చేసి జీవో 26ను విడుదల చేయాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చారని.. అదే విధంగా బీసీలకు 50 శాతం నామినేటెడ్ పదవులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న మహేందర్

టెట్ పరీక్ష ఫీజు తగ్గింపుపై ప్రకటన చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గింపు పై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. టెట్ పరీక్ష ఫీజు తగ్గింపు కోసం అభ్యర్థులు ఆందోళన చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అయితే.. టీఎస్ విద్యుత్‌శాఖ జెన్‌కో కెమిస్ట్రీ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 60 శాతం ఉన్న మార్కుల నిబంధనను సడలించాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, సురేష్‌గౌడ్, నవీన్, బద్రీ, జాల లాలు, రాజశేఖర్, మహేష్, పవన్ పాల్గొన్నారు.

ఏఎన్‌పీఆర్ కెమెరా అందజేత



కెమెరాను ఏసీపీ రాములుకు అందజేస్తున్న ఐజాంట్ ఫార్మా ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: గుండ్లపోచంపల్లికి చెందిన ఐజాంట్ ఫార్మా పరిశ్రమ పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు ఆటోమెటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాను అందజేసింది. శుక్రవారం ఏసీపీ రాములు, సీఐ విజయవర్ధన్‌లకు పరిశ్రమ ప్రతినిధి కెమెరాను అందజేశారు. కీలకమైన కేసులను ఛేదించేందుకు వాహనాల నంబర్ ప్లేట్లను గుర్తించడంలో ఈ కెమెరా దోహదపడనుందని ఏసీపీ రాములు పేర్కొన్నారు.

ప్రొ.మధుజ్యోతికి తెలుగు వర్సిటీ పురస్కారం

ఉస్మానియా యూనివర్సిటీ: ద్రావిడ విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.కొలకలూరి మధుజ్యోతి పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ ఉత్తమ రచయిత్రి ప్రతిభా పురస్కారం అందుకున్నారు. తెలుగు భాష సాహిత్య రచనలు చేసిన సేవలను గుర్తించిన తెలుగు వర్సిటీ 2022 ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో వీసీ ప్రొ.మధుజ్యోతికి ఉత్తమ రచయిత్రి పురస్కారంతో పాటు రూ. 20,166 నగదును ముఖ్య అతిథిగా హాజరైన సినీ దర్శకులు బి.నర్సింగరావు, వీసీ ప్రొ.తంగెడ కిషన్‌రావు అందజేశారు. తెలుగు ప్రొఫెసర్‌గా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 300లకు పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. వివిధ పత్రికల్లో 101 వ్యాసాలు రాసిన ఆమె వద్ద 13 మంది విద్యార్థులు పీహెచ్‌డీ 5 మంది ఎంఫిల్ పట్టాలు అందుకున్నట్లు వివరించారు.



ప్రొ.మధు జ్యోతిని సత్కరిస్తున్న అతిథులు

నేడు మ్యూజిక్ థెరపీ వర్క్‌షాప్

నిజాంపేట్: ఇండియన్ మ్యూజిక్ థెరపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రగతినగర్‌లోని ప్రగతిసెంట్రల్ స్కూల్‌లో మ్యూజిక్ థెరపీపై విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ వర్క్‌షాపులో సైకాలజిస్టులు, కౌన్సిలర్లు, ప్రముఖ మ్యూజిషియన్లు పాల్గొననున్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం .89389 50668లో సంప్రదించాలని నిర్వాహకులు గీతాశ్రీ మజుందార్ కోరారు.

ఖమ్మం ఎంపీ టికెట్‌పై ఓయూ జేఏసీ నేతల్లో ఉత్కంఠ!

ఉస్మానియా యూనివర్సిటీ: ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ సీటు కేటాయింపుపై ఓయూ విద్యార్థి జేఏసీ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం రాలేదని నామినేటెడ్ పదవులు కూడా దక్కలేదని విద్యార్థి నేతలు కాంగ్రెస్ పార్టీ పట్ల అసంతృప్తితో ఉన్న విషయం విదితమే. ఖమ్మం ఎంపీ స్థానాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందినికి కాకుండా బీసీ నాయకులకు కేటాయించాలనే చర్చ జరగడంతో ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు డాక్టర్ లోకేష్‌యాదవ్ పేరు తెరపైకి వచ్చింది. తెలంగాణ ఉద్యమంతో పాటు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలో పాల్గొని గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం ఎన్నికల ప్రచారం చేసిన లోకేష్‌యాదవ్‌కు టికెట్ కేటాయించాలని ఓయూ జేఏసీ నాయకులు కోరుకుంటున్నారు. అయితే.. భట్టి విక్రమార్క గ్రామానికి చెందిన లోకేష్‌యాదవ్ ఆయన ప్రధాన అనుచరుడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

కేసు నమోదు.. దర్యాప్తు మరూ

సుభాష్‌నగర్: వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఓ వృద్ధుడికి తీవ్రగాయాలైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్‌కు చెందిన వెంకటరమణ (67) ఈనెల 27న డ్యూటీ నిమిత్తం టీవీఎస్ జ్యూపిటర్ (టీఎస్ 07 ఈఎన్ 3893)పై కైసర్ నగర్ మీదుగా జీడిమెట్లకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కైసర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ సముదాయం సమీపంలో ఎదురుగా వేగంగా వచ్చిన కేటీఎం ద్విచక్ర వాహనదారుడు వెంకటరమణ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో కింద పడిన అతడి తలకు బలమైన గాయం కావడంతో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని క్షతగాత్రుడి కుమారుడు అజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ● కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జోరుగా ప్రచారం

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల పాలనలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందని మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం దుండిగల్ తండాలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కూలిపోయే స్థితిలో ఉందన్నారు. ఒక్కొక్కరిగా నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలు మారుతున్నారని ఎద్దేవా చేశారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాట తప్పిందన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చైనా బజార్లు మూతబడ్డాయని అన్నారు. మేక్ ఇన్ ఇండియాతో స్వదేశీ వస్తువులకు డిమాండ్ పెరిగిందన్నారు.

◆ మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రానికి ఇళ్ల నిర్మించేందుకు రూ.2.53 లక్షల నిధులు ఇస్తే పేదవారికి గూడు నిర్మించకుండా పక్కదారి పట్టించారని, మరో వైపు దేశ వ్యాప్తంగా నరేంద్రమోదీ ఆధ్వర్యంలో రూ.12కోట్ల టాయిలెట్ల కట్టించి మహిళల ఆత్మగౌరవాన్ని నిలిపారని పేర్కొన్నారు.

◆ తనకు మల్కాజ్‌గిరి ఎంపీగా అవకాశం కలిస్తే కేంద్ర నిధులను తీసుకురావడంతో పాటు రాష్ట్రంలో ఇచ్చిన హామీల కోసం కొట్లాడతానన్నారు. భవిష్యత్ తరాల అభ్యున్నతికి దృష్టిలో ఉంచుకుని కమలం గుర్తుపై ఓటేసి తనకు అఖండ విజయాన్ని అందించాలని కోరారు.



దుండిగల్ తండాలో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న ఈటల రాజేందర్

జింఖానా మైదానంలో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న సీఈవో మధుకర్ నాయక్

రసూల్‌పురా: దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన హస్త కళాకారులు, చేతి వృత్తులు రూపొందించిన కళాఖండాలు జంటనగరాల ప్రజలకు అందుబాటులో ఉన్నాయని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం జింఖానా మైదానంలో గాంధీ స్మృతి, దర్శన్ సమితి ఆధ్వర్యంలో పునర్ మహోత్సవ్ ఎగ్జిబిషన్ ప్రదర్శనను సీఈవో మధుకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి చైర్మన్‌గా ఉన్న గాంధీ స్మృతి సంస్థ ద్వారా కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు దేశ వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నారని అందులో భాగంగా మన హైదరాబాద్ నగరంలో పదిహేను రోజుల పాటు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ప్రదర్శనలో వివిధ కళాకృతులు, జనపనార, తోలు వస్తువులు, లక్క గాజులు, వస్త్రాలు నగర వాసులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సంగీత సాంస్కృతి కార్యక్రమాలు రుచికరమైన వివిధ రాష్ట్రాలకు చెందిన వంటకాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు వెల్లడించారు.

మహిళ అదృశ్యం

సుభాష్‌నగర్: మతిస్థిమితం సరిగా లేని మహిళ అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం శ్రీరామ్‌నగర్‌కు చెందిన నవజ్యోత్‌సింగ్ అత్త సుర్జీత్‌కౌర్(38) ఇటీవల ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చింది. కాగా శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పా చెప్పకుండా సుర్జీత్‌కౌర్ వెళ్లిపోయింది. దీంతో ఆందోళన చెందిన బంధువులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని.. పలుసార్లు ఇంటి నుంచి వెళ్లి తిరిగొచ్చిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మహిళ బంధువులు పేర్కొన్నారు.

కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్ సాధించడం ఖాయం..

నిజాంపేట్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి కౌసల్య కాలనీపార్క్, నిజాంపేట్ శ్రీరాములకుంట పార్క్‌ల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల జరిగిన ఎన్నికల ప్రచారంలో ఈటల పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 400 పైచీలుకు లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీగా తనకు ఆశీర్వదిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. గతంలో రాష్ట్ర మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న తనకు మద్దతిచ్చి కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. దేశం అభివృద్ధి పథంలో పయనించాలంటే ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీని గెలిపించాలని కోరారు.

◆ ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకుడు మల్లారెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సులోచన, ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి నాగరాజు, కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి గొల్ల కృష్ణ, భిక్షపతియాదవ్, ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, సత్యనారాయణ, సెక్రటరీ ప్రసాద్, అరుణ్, సుధాకర్‌రెడ్డి, శేషారావు, అధికార ప్రతినిధి కౌశిక్ నాయుడు, కాశి, విజయ్‌కుమార్, సుమన్ రావు తదితరులు పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీ హైదరాబాద్– ప్లాక్ష యూనివర్సిటీ ఒప్పందం



ప్రొ. పీజేనారాయణన్, ప్లాక్షా వైస్‌చాన్సలర్ ప్రొ.రుద్ర ప్రతాప్ సంతకాలు చేస్తున్న దృశ్యం

● 'సుస్థిరత' కోసం 'ఉమ్మడి కేంద్రం' ఏర్పాటుకు నిర్ణయం
● ఒప్పందంపై సంతకాలు చేసిన ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: 'సుస్థిరత' కోసం 'ఉమ్మడి కేంద్రం ' (సస్టేనబుల్ సెంటర్) ఏర్పాటు చేయాలని గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్, ప్లాక్ష యూనివర్శిటీ సమిష్టిగా నిర్ణయించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పంద పత్రాలపై ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్, ప్లాక్ష యూనివర్శిటీ వ్యవస్థాపక వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రుద్ర ప్రతాప్ సంతకాలు చేశారు. ఈ సెంటర్ ప్రాథమికంగా గ్రామాలు, పట్టణాల చుట్టూ ఉన్న పిరమిడ్ వినియోగ కేసుల పరిశోధనపై దృష్టి పెడుతుంది. ఇది గాలి, కాలుష్యం, నీరు, నెట్‌వర్క్‌లు, డబ్ల్యూటీపీ, ఎస్‌టీపీ, వర్షం, శక్తి, స్మార్ట్ మీటర్లు, పంపిణీ, గ్రిడ్‌లు, నిల్వ, వ్యర్థాల నిర్వహణ ఘనసీరు, ఇతరత్రా వాటితో పాటు ఆహారం/వ్యవసాయం వంటి ఫంక్షనల్ డొమైన్‌లలో సమస్యలను తీసుకుంటుంది.

ఉమ్మడి నిర్ణయాలు అమలు చేస్తాం

ఈ కేంద్రం ప్రభావవంతమైన పరిశోధన, విద్యా కార్యక్రమాలు, సమాజ ప్రమేయంపై పనిచేస్తుందన్నారు. మా మధ్య బంధం మరింత పెంచేందుకు ఈ ఒప్పందం ఎంతో దోహదం చేస్తుందన్నారు.ప్లాక్ష యూనివర్శిటీ వ్యవస్థాపక వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రుద్ర ప్రతాప్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

బ్లాక్‌లో విక్రయిస్తున్న మద్యం స్థావరంపై దాడులు

సుభాష్‌నగర్: బ్లాక్‌లో విక్రయిస్తున్న మద్యం స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సూరారం కాలనీ హమీద్‌బస్తీలో బ్లాక్‌లో విక్రయిస్తున్న మద్యం అడ్డాలపై శుక్రవారం దాడులు నిర్వహించి 10బాటిళ్ల బీర్లు, 16బాటిళ్ల 180మద్యం బాటిళ్లు లభించాయి. వాటిని సీజ్ చేసిన పోలీసులు విక్రయాలు చేపడుతున్న శివాలయనగర్‌కు చెందిన శివారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. జీడిమెట్లలోని వైన్స్ దుకాణాల నుంచి మద్యం తీసుకువచ్చి ఎక్కువ ధరలకు విక్రయాలు చేపడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.